సాక్షి
హనుమకొండ
శనివారం | 26 | ఆగస్టు | 2023



ఆన్‌లైన్ షాపింగ్.. జర భద్రం
ఆన్‌లైన్ షాపింగ్‌పై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ, కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్‌తో తీవ్రంగా నష్టపోతున్నారు. - 8లో▸



సామాజిక న్యాయం లేదు
రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదని, దొరల రాజ్యం నడుస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$29^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా సుభాషిణి



కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వరంగల్ డీఐజీగా సుభాషిణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి డీఐజీగా విధులు నిర్వహిస్తున్న సుభాషిణి వరంగల్‌కు, వరంగల్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న సైదిరెడ్డి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. వరంగల్ డీఐజీ కార్యాలయంలో శుక్రవారం సుభాషిణికి సైదిరెడ్డి బాధ్యతలను అప్పగించి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, చిట్స్ సహాయ రిజిస్ట్రార్ వేణుమాధవ్, సబ్ రిజిస్ట్రార్లు అమ్జద్ అలీ, సంపత్ కుమార్, రాజు, కార్తీక్, తస్లీమా, మసీయుద్దీన్, తదితరులు డీఐజీ సుభాషిణికి పుష్పగుచ్ఛాలు అందించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

దూర విద్య డిగ్రీ పరీక్షల్లో 44 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ కోర్సుల ఫైనల్ ఇయర్ పరీక్షల్లో రెండు పరీక్షా కేంద్రాల్లో 44 మందిని డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 40 మంది విద్యార్థులు, నల్గొండలోని ఎన్‌జీ కళాశాలలో నలుగురు మొత్తం 44 మంది కాపీయింగ్ చేస్తుండగా.. పట్టుకుని డీబార్ చేసినట్లు తెలిపారు. 3,815 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 961 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

పీహెచ్‌సీల సందర్శన



ఆత్మకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు కమిటీ బృందం పరిశీలించింది. ఇక్కడి వసతులు, సిబ్బంది పని తీరును అధ్యయనం చేశారు. జాతీయ కమిటీ బృంద సభ్యులు డాక్టర్ అరుణ్‌త్రివేది, ప్రశాంత్ సత్య, దిల్‌కప్సే పీహెచ్‌సీలో రికార్డుల్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణను తెలుసుకున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిబ్బంది వైద్యసేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, యాకూబ్‌పాషా, వైద్యాధికారి స్పందన, మాస్‌మీడియా అధికారి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, క్వాలిటీ మేనేజర్లు భాను, సంతోష్, బాబునాయక్, సీహెచ్‌ఓ ప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రేపు బీజేపీలోకి డాక్టర్ కాళీప్రసాద్



ఎంజీఎం: ఈనెల 27వ తేదీన ఖమ్మంలో జరగనున్న బీజేపీ బహిరంగ సభలో అగ్రనేత అమిత్ షా సమక్షంలో వరంగల్ గార్డియన్ ఆస్పత్రి అధినేత, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ ఆ పార్టీలో చేరనున్నారు. సుమారు 500మంది కార్యకర్తలు, ఇతర రాజకీయ పార్టీల్లోని తన అభిమానులతో భారీ కాన్వాయ్‌తో వరంగల్ నుంచి బయలుదేరనున్నారు. అమిత్‌షా చేతులమీదుగా కాషాయ కండువా కప్పుకోనున్నారు.

త్వరలో విడుదల!

టీపీసీసీ చేతిలో ఆశావహుల దరఖాస్తులు

- ఉమ్మడి వరంగల్‌లోని 12 స్థానాల నుంచి 53 మంది పోటీకి సై..
- డీసీసీ, పీసీసీల సిఫారసుతో సీడబ్ల్యూసీకి జాబితా
- ఆశావహుల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్లు
- హైదరాబాద్‌లో ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- లాబీయింగ్ కోసం ఢిల్లీ బాట



గాంధీభవన్ భవన్ వద్ద దరఖాస్తుతో ఇనగాల అనుచరులు



పరకాల సీటు కోసం దరఖాస్తు అందజేస్తున్న బొమ్మతి విక్రమ్

సాక్షిప్రతినిధి, వరంగల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కసరత్తు మలిదశకు చేరింది. త్వరలోనే ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక కోసం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 53మంది వివిధ స్థానాలకు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీ, ఎన్నికల నిర్వహణ కమిటీలు ఆ దరఖాస్తులను పరిశీలించి జిల్లా కాంగ్రెస్ కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల్లో సీడబ్ల్యూసీ, పార్టీ కేంద్ర ఎన్నికల పరిశీలన కమిటీకి పంపనున్నారని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనే వారినే ఈసారి బరిలోకి దింపే ఆలోచనలో ఉన్న అధిష్టానం.. ఆశావహుల జాబితాపై త్వరలోనే తుదినిర్ణయం తీసుకుంటుందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో సాగుతోంది.

భూపాలపల్లి, ములుగుకు ఒక్కొక్కటి.. మిగతా చోట్ల పోటాపోటీ...

ఈ నెల 18న మందకొడిగా సాగిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల దరఖాస్తుల ప్రక్రియ.. మూడు రోజులుగా పోటెత్తింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముఖ్య నాయకులంతా గురు, శుక్రవారాల్లో తమ దరఖాస్తులను హైదరాబాద్ గాంధీభవన్‌లో దాఖలు చేశారు. శుక్రవారం రాత్రి వరకు పార్టీ వర్గాల సమాచారం మేరకు 53 మంది ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలకు ఒక్కొక్కరు చొప్పున దరఖాస్తు చేసుకోగా.. నర్సంపేట నుంచి రెండు దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా వర్ధన్నపేట నుంచి పదకొండు మంది వరకు పోటీ పడుతున్నారు. 12 నియోజకవర్గాలనుంచి ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు దరఖాస్తు చేసుకున్నారు.

ఓవర్ టు హైదరాబాద్.. ఆశావహుల ఢిల్లీబాట

వారం రోజుల్లోపే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందన్న సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ ఆశావహులు పలువురు అప్పుడే ఢిల్లీబాట పట్టారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసే వరకు హైదరాబాద్‌లోనే మకాం వేసిన పలువురు నేతలు ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పయనం అయ్యారు. కొందరు డీసీసీ నేతలను, మరికొందరు టీపీసీసీ పెద్దలను వెంటబెట్టుకుపోగా.. మరికొందరు ఏకంగా ఏఐసీసీ పెద్దలతోనే లాబీయింగ్ చేస్తుండడం ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్‌లో వేడిని పెంచింది.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తుదారుల వివరాలు..

వరంగల్ తూర్పు: కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణ, ఎంబాడి రవీందర్, అజ్మతుల్లా హుస్సేనీ
వరంగల్ పశ్చిమ: నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి, కట్ల శ్రీనివాస్, రేపల్లె శ్రీనివాస్, తక్కళ్లపల్లి సారిక, రేపల్లె రంగనాథ్
జనగామ: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎర్రమళ్ల సుధాకర్, గిరి కొండల్‌రెడ్డి
పాలకుర్తి: అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బండి సుధాకర్‌గౌడ్, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, డా.లక్ష్మీనారాయణనాయక్
పరకాల: ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కొండా మురళీధర్‌రావు, అవేలి దామోదర్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, బొమ్మతి విక్రమ్
మహబూబాబాద్ : బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, డాక్టర్ భుక్యా మురళీనాయక్, సునావత్ రాధ, సునావత్ రమేశ్, దస్రునాయక్.
స్టేషన్ ఘన్‌పూర్: దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర, చేపూరి వినోద్, డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ, గంగారపు అమృతరావు, డాక్టర్ రాజమౌళి
డోర్నకల్ : జాటోత్ రాంచంద్రు నాయక్, మాలోత్ నెహ్రూ నాయక్, నునావతు భూపాల్ నాయక్
ములుగు: ధనసరి సీతక్క
భూపాలపల్లి: గండ్ర సత్యనారాయణ రావు
నర్సంపేట: దొంతి మాధవరెడ్డి, కత్తి వెంకటస్వామి
వర్ధన్నపేట: నమిండ్ల శ్రీనివాస్, కేఆర్ నాగరాజు, బక్క జడ్సన్, సిరిసిల్ల రాజయ్య, సుంచు రవి, బందెల భద్రయ్య, పులి అనిల్, ఆనంద్‌కుమార్, నరుకుడు వెంకటయ్య, యాక స్వామి, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

ఎమ్మెల్యే వేధింపులతోనే రాజీనామా చేశా

లక్ష్మీపురం మాజీ సర్పంచ్ మల్లేశ్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మల్లేశ్‌గౌడ్

పరకాల: 'సర్పంచ్‌గా నేను పదవి చేపట్టినప్పటి నుంచి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించలేదు. బీఆర్‌ఎస్ నాయకులతో దాడులు, ఎస్సీ, ఎస్టీ కేసులతో వేధింపులకు గురిచేశాడు. అందుకే సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన' అని పరకాల మండలం లక్ష్మీపురం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌టీపీ నాయకుడు ఆముదాపల్లి మల్లేశ్‌గౌడ్ తెలిపారు. పరకాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లేశ్ మాట్లాడుతూ తన రాజీనామాతోనైనా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాటుపడుతారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉంటూ అభివృద్ధిని ప్రశ్నించడమే నేరంగా మారిందని, ఆయన చివరకు బీఆర్‌ఎస్ నాయకులతో దాడులు చేయించడం, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించడం, మానసిక వేధింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వేధింపులతోనే సర్పంచ్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ ప్రజల చేతిలో చల్లా ధర్మారెడ్డి చిట్టా ఉందన్న విషయాన్ని మరిచిపోవద్దని, రాబోయే రోజుల్లో కచ్చితంగా ధర్మారెడ్డికి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు.

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా పశువైద్యాధికారి వెంకటనారాయణ



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దామెర: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని పులుకుర్తిలో పశు సంవర్థక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 56 పశువులకు గర్భ కోశ వ్యాధులు, 90 పశువులకు గాలికుంటు, 85 పశువులకు నట్టల నివారణ, ముద్దచర్మ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువులకు గర్భధారణ చేయడం ద్వారా మేలు జాతి దూడలు వృద్ధి చెందుతాయన్నారు. గోపాల మిత్ర సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, వికాస తరంగిణి ప్రతినిధులు, రిటైర్డ్ జేడీ డాక్టర్ చాడా సుభాశ్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ దీపిక, ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, సర్పంచ్ గోవిందు అశోక్, వీఎల్‌ఓ లక్ష్మణ్, జేవీఓ రవి, ఎల్‌ఎస్‌ఏ సిరాజుద్దీన్, శంకర్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి, సతీశ్, కుమారస్వామి, పశుమిత్ర సరిత, వికాస తరంగిణి ప్రతినిధులు దయాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజల్లోనే ఉంటా : ఎమ్మెల్యే రాజయ్య



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్: 'ఆరు నూరైనా.. నేను ప్రజల మధ్యనే ఉంటా, ప్రాణాలు అడ్డువేసైనా మిమ్మల్ని కాపాడుకుంటా' అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు మండలాలకు చెందిన బీసీ కులవృత్తిదారులు, చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థికసాయం పథకంలో భాగంగా శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయంతో అధునాతనమైన పరికరాలు కొని ఆర్థికంగా బలపడాలని లబ్ధిదారులకు సూచించారు. త్వరలోనే దళితబంధు అందిస్తామని, అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి రాంరెడ్డి, ఎంపీడీఓలు జవహర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించండి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: వచ్చే ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీపీ ఏవీ.రంగనాథ్‌తో కలిసి ఆమె సెక్టోరల్, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు 42 మంది సెక్టోరల్ అధికారుల్ని నియమించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే మార్గదర్శకాల్ని పాటిస్తూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని సూచించారు. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులకు ప్రతీ అంశంపై సంపూర్ణ పరిజ్ఞానం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓలు రమేశ్‌కుమార్, శ్రీనివాస్, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, పోలీస్, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సెప్టెంబర్ 19లోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితా పరిశీలన, విచారణ, నమోదు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నూతన ఓటర్లు, ఓటరు సవరణల కోసం ప్రజలు వారి దరఖాస్తులను ఆర్డీఓ, తహసీల్దార్, బూత్ లెవల్ అధికారికి అందించాలని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వారు https://www.nvsp.in లేదా https://voters.eci.gov.in లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడు వడ్డేపల్లి చెరువులోకి 3.80 లక్షల చేప పిల్లలు

హన్మకొండ చౌరస్తా: ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ విజయభారతి తెలిపారు. మొదటి రోజు హనుమకొండలోని వడ్డేపల్లి చెరువులో 3.80 లక్షల చేప పిల్లలను వదలనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీని ప్రారంభించనున్నట్లు విజయభారతి పేర్కొన్నారు. విడతల వారీగా జిల్లాలోని అన్ని చెరువుల్లో ఉచితంగా రవ్వ, బొచ్చె, ఇతర జాతుల చేపలను వదలనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేడు మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో శనివారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు సైన్స్ సెంటర్ అధికారి రాకేశ్ శుక్రవారం తెలిపారు. సీసీఎంబీ బెంగళూరులోని విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం సౌజన్యంతో డీఎస్‌ఏపై పూర్తి అవగాహన కల్పించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కాకతీయుల రాజ్యం.. కబ్జారాయుళ్ల సామ్రాజ్యం

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: కాకతీయుల రాజ్యాన్ని.. ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కబ్జారాయుళ్ల సామ్రాజ్యంగా మార్చారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగులకు భృతి, ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సుబేదారిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులు గేట్లు మూసి, ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. గేట్ ఎదుటే ధర్నా చేశారు. దీంతో నాయకులు రావు పద్మ, వి.మురళీధర్‌గౌడ్, రావుల కిషన్, గురుమూర్తి శివకుమార్, డా.పెసరు విజయ చందర్ రెడ్డి, దేశిని సదానందంగౌడ్, కొండి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, బైరి శ్రావణ్, భరత్ గౌడ్, నాంపల్లి శ్రీనివాస్, పుల్యాల రవీందర్‌రెడ్డి, జన్ను మధు, సయాదుద్దీన్, నాను నాయక్ పాల్గొన్నారు.

నేడు 50 వేల మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కల ప్లాంటేషన్‌లో భాగంగా శనివారం వరంగల్ నగర వ్యాప్తంగా 50 వేల మొక్కలు నాటాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శుక్రవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో మెప్మా సిబ్బంది, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో మేయర్ మాట్లాడుతూ.. హనుమకొండ హౌసింగ్ బోర్డ్ కాలనీ, టీకే రెడ్డి కాలనీ, వరంగల్‌లో ఎస్‌ఆర్టీ కాలనీ పార్క్, ప్రతాప్‌నగర్ పార్క్ ప్రాంతాల్లో మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సీఓలు, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాలు సమన్వయం చేసుకుంటూ మొక్కలు నాటేలా ప్రజల్ని చైతన్యవంతం చేసి కార్యక్రమ విజయవంతానికి సహకరించాలని గుండు సుధారాణి అన్నారు.

ఓటర్లకు చైతన్యం కల్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్, ఈఆర్‌ఓ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ప్రతీ పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో తహసీల్దార్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, జర్నలిస్టులు, జ్యూడీషరీ, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వ్యక్తుల వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు పరిశీలించి ధ్రువీకరించి, వివరాలు సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిధి వీవీపీల వివరాలు జాబితా నుంచి తొలగిపోకుండా సరిచూసుకుని ఏఈఆర్‌ఓలు నిర్ధారించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు మహమ్మద్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వరలక్ష్మీ అలంకరణలో పద్మాక్షిమాత



వరంగల్ రాజరాజేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు



శ్రీభద్రకాళి అమ్మవారు



అమ్మవారి దర్శనానికి నిల్చున్న భక్తులు



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళ



వరలక్ష్మీ.. నమోస్తుతే

శ్రావణమాసం రెండో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. వరంగల్ భద్రకాళి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. దీపాలు సమర్పించి కుంకుమపూజలు, చీరసారెలతో ఒడిబాలబియ్యం సమర్పించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శేషుభారతి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా వరంగల్ రాజరాజేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. హనుమకొండలోని పద్మాక్షి అమ్మవారు వరలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వ్రతాలు, నోములు, అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ వేద పండితుడు షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు.

- హన్మకొండ కల్చరల్/హన్మకొండ అర్బన్

ఆన్‌లైన్ షాపింగ్.. జర భద్రం

- కనీస జాగ్రత్తలు తీసుకోవాలి
- అప్రమత్తత తప్పనిసరి
- ఆకర్షణీయ ప్రకటనలు, ఆఫర్లను నమ్మితే ఇక అంతే..

డిస్కౌంట్లు.. డిస్కౌంట్లు. అప్‌టు 50 పర్సంట్, 75 పర్సంట్ వరకు తగ్గింపు.. ఒక వస్తువు కొంటే మరోటి ఫ్రీ.. పైగా ఉచిత డోర్ డెలివరీ.. ఇలా ఒకటేమిటి ఆన్‌లైన్ షాపింగ్‌లో అన్నీ ఇలాంటి ఆఫర్లే దర్శనమిస్తాయి. బోగస్ ప్రకటనలెన్నో. ఇందులో కొన్ని నిజం కూడా కావొచ్చు.. అయితే ఉద్యోగాలు, ఇంటి పనులతో సమయం చిక్కని వారికి ఆన్‌లైన్ షాపింగ్ వరమే. కానీ ఆన్‌లైన్ షాపింగ్‌లో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. తగిన సూచనలు పాటిస్తూ, విచక్షణ ఉపయోగించి ఆన్‌లైన్ షాపింగ్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



కాజీపేట: ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ షాపింగ్‌పై అన్ని వర్గాల వారు ఆసక్తి కనబరుస్తున్నారు. షోరూంలలో కనిపించని వస్తువులు అనేకం ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. అయితే నెట్‌లో కనిపించే ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలన్నీ నమ్మితే మోసపోవడం ఖాయం. ప్రచారంలో చెప్పేదొకటి.. ఆర్డర్ ఇవ్వగానే డెలివరీ అయ్యేది మరోటి. పైగా ధరల్లో తేడాలు. దీని గురించి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉంటుంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో చాలా తక్కువ ధరలకే వివిధ రకాల ఉత్పత్తులను లభిస్తున్నాయి. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, రెడీమేడ్స్, లేడీస్ యాక్సెసరీస్, కాస్మోటిక్స్, స్మార్ట్‌ఫోన్‌లు ఇలా అనేక రకాల ఉత్పత్తులు ఉన్నాయి. ఆర్డర్ చేసిన కొద్దిరోజుల్లోనే ఆయా కంపెనీలు వాటిని ఇంటికే నేరుగా సరఫరా చేస్తాయి. ఇంట్లో కూర్చొనే కావాల్సిన వస్తువులను హాయిగా కొనుగోలు చేస్తున్నారు. అయితే చూడడానికి, వినడానికి ఇది ఎంతో బాగున్నా కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్డర్ ఇచ్చిన వస్తువులు ఇంటికి రాగానే వాటిని చూసి అవాక్కైపోతున్న వారు అధిక శాతం మంది ఉన్నారు.

ఆకర్షణలకు లొంగొద్దు..

ఆకర్షణీయమైన ప్రకటనలు ఇచ్చే కంపెనీల్లో నమ్మకమైనవే కాకుండా కొన్ని బోగస్ కంపెనీలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఒక స్మార్ట్‌ఫోన్‌కు ధర చెల్లిస్తే ఉచితంగా ఇంటికి చేరుస్తామని చెప్పారు. తీరా ఆర్డర్ చేసిన తర్వాత ఇంటికి వచ్చిన ప్యాక్‌ను తెరిస్తే బొమ్మ ఫోన్ లేదా రాళ్లు నింపి పంపించిన ఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే రెడీమేడ్ వస్తువులు ఆర్డర్ ఇస్తే నాసిరకం ఉత్పత్తులు పంపించిన సందర్భాలు ఉన్నాయి. తీరా వారిచ్చిన నంబర్‌కు ఫోన్ చేసినా ఫలితం ఉండదు. దీంతో తాము మోసపోయమని గ్రహించిన పట్టించుకునే వారు ఉండరు. అందుకే ఆన్‌లైన్ షాపింగ్ చేసే ముందు ఆయా కంపెనీల గురించి తెలుసుకుని ఉండడం మంచిది.

ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు..

- సదరు కంపెనీ ఎలాంటి ఉత్పత్తులపై వ్యాపారం చేస్తుందో గమనించాలి.
- కంపెనీకి సంబంధించిన వివరాలు ముందే తెలుసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులు, షాపింగ్ మాల్స్‌లో లభించే వస్తువుల ధరల్లో ఏమైనా తేడాలు ఉన్నాయో లేదో గమనించాలి.
- ఆయా ఉత్పత్తులపై ఇచ్చే డిస్కౌంట్స్, వివిధ రకాల ఆఫర్ల గుర్తించి అవగాహన ఉండాలి.
- బోగస్ కంపెనీల గురించి తరచూ పత్రికల్లో కానీ, పోలీసులు చెబుతుంటారు. వాటిని పరిశీలిస్తూ ఉండాలి.
- ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.
- ఎప్పుడైనా మోసపోయినట్లు తెలిస్తే వెంటనే సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేయొచ్చు.
- ఆన్‌లైన్ కంపెనీలకు సంబంధించిన ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలి. వాటి అడ్రస్ గురించి తెలుసుకోవాలి. ఎప్పుడైనా మోసం జరుగుతుందని అనుమానం వస్తే సదరు నంబరుకు ఫోన్ చేయాలి.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువుల ప్యాకింగ్‌పై కంపెనీల చిరునామా, ఎప్పుడు తయారయ్యాయే గమనించాలి.

కంపెనీల విశ్వసనీయతను పరిగణనలోకి తీసుకోవాలి



ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి ప్రకటన నిజమే ననే భ్రమ వీడాలి. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఆయా కంపెనీలకు ఉన్న విశ్వసనీయతను పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే వినియోగదారుడు మోసపోయే అవకాశాలు మెండుగా ఉంటాయి.

-సార్ల రాజు సీఐ, కాజీపేట

బీసీల్లో రాజకీయ చైతన్యం అవసరం

- కేయూ వీసీ తాటికొండ రమేష్



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: బీసీల్లో ఐక్యత, రాజకీయ చైతన్యం అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 105వ జయంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక అంశాలపై స్పందించాలని , ప్రశ్నించాలన్నారు. సంస్కరణలు, రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అన్నారు. 76 సంవత్సరాల స్వాతంత్య్ర భారత దేశంలో బీసీ కులాలలు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాయన్నారు. ఎన్నో కమిషన్లు బీసీల ఆర్థిక, సామాజిక అంశాపై నివేదికలు ఇచ్చాయన్నారు. ఒక సామాజిక ఏజెండాతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పూలే దంపతుల గొప్పసంస్కర్తలన్నారు. వారి సేవలు ఒకే వర్గానికే పరిమితం కావొద్దన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్‌లాల్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఏ శ్రీనివాస్, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, అడ్జెంట్ ప్రొఫెసర్ ఎస్ రామస్వామి, రిటైర్డ్ ఆచార్యులు కె విజయబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డీసీఎం డ్రైవర్.. తీవ్రగాయాలు
- బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

చిల్పూరు: యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కథనం ప్రకారం హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మండలంలోని శ్రీపతిపల్లి మీదుగా చిన్నపెండ్యాల నుంచి హైదరాబాద్ వెళ్తోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు చిన్నపెండ్యాల బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై ఘన్‌పూర్‌వైపునకు యూటర్న్ తీసుకుంటోంది.ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి బస్సును వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ ఎస్‌కే సజ్జద్ అహ్మద్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీశారు. బస్సులో వెనుక వైపు కూర్చున్న ప్రయాణికులు యాదమ్మ, శ్రీనివాస్‌కు తీవ్రగాయలయ్యాయి. ముగ్గురు క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం తరలించారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కొమ్ముల బాబు

హన్మకొండ అర్బన్/ హన్మకొండ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు తెలిపారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి భిక్షపతి, యానం విజయ్ కుమార్ సంఘం నిబంధనలకు వ్యతిరేకంగా, టీ పీఆర్‌టీయూ సభ్యులుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని సంఘం నుంచి బహిష్కరించామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తొంత సత్యనారాయణ (యాదాద్రి భువనగిరి జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చాగంటి ప్రభాకర్ (మహబూబాబాద్ జిల్లా), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సీరటి సాయిలు (నిజామాబాద్ జిల్లా), రాష్ట్ర అధికార ప్రతినిధిగా జూపాక జనార్ధన్ (హనుమకొండ జిల్లా) అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా దారా శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కచ్చిగళ్ల మల్లయ్య, పానుగంటి యాదగిరి, పాగ సునీత, భూక్యా విజయలక్ష్మి (వరంగల్ జిల్లా) ఎన్నికయ్యారని వివరించారు. మరో ఆరుగురిని ప్రత్యేక రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



ఉపకరణాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్

కాళోజీ సెంటర్/ఖిలావరంగల్ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, భవిత కేంద్రాల సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగులు) విద్యార్థులకు శుక్రవారం వరంగల్‌లోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపకరణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు ఐఈఆర్పీ లు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ 159 మందికి 253 ఉచిత ఉపకరణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్ కుడికాల సుభాష్, ఫిజియోథెరపిస్ట్ ప్రవీణ్, నర్సింహస్వామి, కపిల్, రవికుమార్, ఎంఈఓ విజయ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎంఎన్‌ఓ రమేష్‌బాబు, హెచ్ఎం శారదాబాయి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ పై పీడీ యాక్ట్



ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ రవిరాజు

వరంగల్ క్రైం: గంజాయ్ స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా పందికుంట గ్రామానికి చెందిన చెక్క కుమారస్వామికి ఆత్మకూరు సీఐ రవిరాజు శుక్రవారం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైల్‌లో పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. కుమారస్వామి సులభంగా ఉబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్ర, హైదరాబాద్ ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మే 29న నిందితుడు కారులో రూ.24 లక్షల విలువైన 120 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. నిందితుడిపై ములుగు, మహబూబాబాద్ జిల్లాలాతోపాటు మహారాష్ట్రలోనూ కేసులు నమోదైనట్లు సీపీ రంగనాథ్ తెలిపారు.

ఏనుమాములలో ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ :ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణ లోని ఈవీఎంలను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాస్‌రావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, కుసుమ శ్యాంసుందర్, ఉదయ్, ఎండీ.నేహాల్, జి.రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ: ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో హనుమకొండ జిల్లాలో 29 ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లకు పదేళ్ల వరకు రెవెన్యూ షేరింగ్ ఆధారితంగా స్థలాన్ని కేటాయిస్తారు. నిబంధనల ప్రకారం సొంత ఖర్చులతో చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఆపరేటర్ల కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి టీఎస్ రెడ్‌కో దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని టీఎస్ రెడ్‌కో రాష్ట్ర కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది. ప్రత్యక్షంగా కేటాయింపు ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు కోరారు. కాగా.. భీమదేవరపల్లిలో 2, కాజీపేటలో 4, హనుమకొండలో 10, ఎలకతుర్తిలో 3, హసన్‌పర్తిలో 3, ఐనవోలులో 1, కమలాపూర్‌లో 1, పరకాలలో 3, శాయంపేటలో 1, వడ్డేపల్లిలో 1 ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 22 టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ సబ్ స్టేషన్లలో ఏర్పాటు చేయనుండగా.. ఒకటి ఇండస్ట్రియల్ ఎస్టేట్ స్థలంలో, ఇంటర్ కాలేజీల స్థలంలో 3, సివిల్ సప్లై శాఖ స్థలంలో 2, విద్యాశాఖ స్థలంలో 1 ఏర్పాటు చేయనున్నారు.

దరఖాస్తులు అందించాలి..



జిల్లాలో ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలనుకునే వారు టీఎస్ రెడ్‌కో రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యక్షంగా దరఖాస్తులు అందించాలి. వివరాలకు టీఎస్ రెడ్‌కో వెబ్‌సైట్‌లో లేదా టీఎస్ రెడ్‌కో కార్యాలయంలో సంప్రదించాలి.

- మహేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్, టీఎస్ రెడ్‌కో

కాళోజీ కళాక్షేత్రం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ బాల సముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఈసందర్భంగా వారు కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని, నిర్మాణ పనుల్ని నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, సభ్యులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు
- నేడు మహా ధర్నా సన్నాహక సదస్సు



నినదిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు నన్నబోయిన తిరుపతి, హనుమకొండ జిల్లా నాయకులు ఎం.సదాశివరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ డీఈఓ కార్యాలయ ఆవరణలో వారు సమావేశమై మాట్లాడారు. దశలవారీ ఆందోళనల్లో భాగంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమ సన్నాహక సదస్సును శనివారం సాయంత్రం 5గంటలకు యూఎస్‌పీసీ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసదస్సుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కె.శ్రీనివాస్, ఎం.రఘుపతి, తాటికాయల కుమార్, టి.సుదర్శనం, బద్దం వెంకటరెడ్డి, ఎ.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మెడిసిన్‌పై అవగాహన పెంచాలి

- జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ చౌహాన్

ఎంజీఎం: జనరిక్ మెడిసిన్ ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఆస్పత్రుల కో–ఆర్డినేటర్ డాక్టర్ చౌహాన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జనరిక్ మెడిసిన్ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఇందులో డాక్టర్ సాంబశిరావు మాట్లాడుతూ.. జనరిక్ మెడిసిన్ ఉపయోగించేలా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల మందుల షాపుల్లో జనరిక్ మందులకు ప్రత్యేక ర్యాక్ ఏర్పాటు చేసుకునేలా నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో జీఎంహెచ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, తెలంగాణ హాస్పిటల్స్, పేషెంట్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సతీశ్, జనార్దన్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ డెమో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణలో సామాజిక న్యాయం లేదు

- 'కడియం'లో కక్కుర్తి పెరిగిపోయింది
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: తెలంగాణలో సామాజిక న్యాయం లేదని, దొరల రాజ్యం నడుస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ హరిత హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దొరల రాజ్యానికి నిదర్శనం సీఎం కేసీఆర్ పాలన అని, తెలంగాణలో మాదిగలను, బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలలో ముగ్గురు మాత్రమే మంత్రులని, బీసీ కోటాలో ఖాళీ అయిన మంత్రి స్థానం రెడ్లకు కేటాయింపుతో తెలంగాణలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సీఎం కేసీఆర్ రెండు బీసీ అభ్యర్థుల నియోజకవర్గాల్లో పోటీ చేస్తూ వారికి గండి కొడుతున్నాడన్నారు. బీఆర్ఎస్ పార్టీలో 11 మంది ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో ఒక్కరికి కూడా చోటు లేదు కానీ, ఆరుగురు రెడ్లకు మంత్రి పదవులు ఉండగా ఏడవ మంత్రి పదవి ఎందుకు ఇస్తున్నారో సమాజానికి జవాబు చెప్పాలన్నారు. కడియం శ్రీహరిలో కక్కుర్తిలో పెరిగిపోయిందని, ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఉండగా ఎమ్మెల్యే టికెట్ ఎందుకని ప్రశ్నించారు. ఆయనపై ఉన్న గౌరవం పోయిందన్నారు. కడియం శ్రీహరి రాజీనామా చేసి స్టేషన్ ఘన్‌పూర్‌లో మాదిగలకు సీటు కేటాయించాలన్నారు. భిన్న పార్టీల కార్యకర్తల మధ్య దాడులు సరికాదని, ఏ పార్టీ వారు కూడా ఇంటిమీద దాడులకు పిలుపు ఇవ్వవద్దన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు తీగల ప్రదీప్ గౌడ్, మంద కుమార్ మాదిగ, సుకుమార్ మహాజన్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే ఉద్యోగాలు

- డీవైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమగ్ని రాజ్ భట్టాచార్య



మాట్లాడుతున్న హిమగ్ని రాజ్ భట్టాచార్య

హన్మకొండ : దేశంలో బీజేపీని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు లభిస్తాయని డీవైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమగ్ని రాజ్ భట్టాచార్య అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యా, ఉపాధి' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో హిమగ్ని రాజ్ భట్టాచార్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలోని నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం.. ఆ హామీని నెరవేర్చలేక పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి, నాయకులు బషీర్, తిరుపతి నాయక్, రోషన్ బేగం, వెంకటేష్, గొడిశాల కార్తీక్, జగన్ పాల్గొన్నారు.

రాంచందర్ హత్యకేసులో పురోగతి..!

- హత్య చేసి బైక్‌పై పరారీ..
- సీసీ ఫుటేజీ ద్వారా గుర్తింపు
- నిందితుల ఫొటోలు విడుదల



బైక్‌పై పరారవుతున్న నిందితులు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో బుధవారం జరిగిన విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు కనిపిస్తోంది. ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ టి. నరేష్ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే కరీమాబాద్-వరంగల్ ప్రధాన రహదారిపై ఫ్లెక్టివర్ సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు నిందితులు బైక్‌పై పరారీ అవుతున్నట్లు కనిపించింది.

నిందితులను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి

రాంచందర్‌ను హత్య చేసిన నిందితులు బైక్‌పై పరారవుతున్న ఫొటోలను విడుదల చేశామని, ఎవరైనా నిందితులను గుర్తించినా, వారి ఆచూకీ తెలిసినా వెంటనే తమకు సమాచారం అందించాలని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టీ. సురేష్ పేర్కొన్నారు. ఈమేరకు నిందితులు హీరో ప్యాషన్ బైక్‌పై పరారవుతున్న ఫొటోలను శుక్రవారం విడుదల చేశారు. నిందితులను గుర్తించిన వారు వెంటనే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 8712685119, ఐటీ సెల్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ 8712685159, టాస్క్‌ఫోర్స్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ 8712685150, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ నంబర్ 8712685006 సమాచారం అందజేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో దొరల పెత్తనం ఏందీ?



మాట్లాడుతున్న సుధాకర్

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

హన్మకొండ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి వజ్రోత్సవాలు పూర్తి చేసుకున్నా ఇంకా దొరల పెత్తనం పోవడం లేదని, ఎస్సీ ఎస్టీ నియోజకవర్గాల్లో వారి పెత్తనం ఏందని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ మాల మహానాడు హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీలో దొరల ఆధిపత్యం కొనసాగుతుందోన్నారు. తమ ఆధిపత్యం కొనసాగడానికి కొంతమందితో రాజకీయ బ్రోకరిజం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఓటు చైతన్యం కోసం అంబేడ్కర్ ఆలోచన విధానాలను గ్రామాల్లో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ అశోద భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, కొండ్ర నర్సింగరావు, గంపల సాంబయ్య, నర్సింహారావు, భవాని, అనిత, తదితరులు పాల్గొన్నారు.